# మార్పు

శశీ నేను చిన్నప్పుడు స్నేహితులం. మా ఇద్దరిదీ ఒకే వయసు. వాళ్ళ ఇల్లు మా ఇంటికి కొంచం దూరం. రోజూ మా ఇంటికి ఆడుకోటానికి వస్తూ ఉండేది. వాళ్ళు నలుగురు అప్పచెల్లెళ్ళు. వాళ్ళ నాన్న అమ్మా చాలా అందమైనవాళ్ళు. పిల్లలకు అదే పోలిక వచ్చింది. వాళ్ళ నాన్నగారు వకీలు. బాగానే సంపాదిస్తూ ఉండేవారు. అయితే పాపం అకస్మాత్తుగా పోయారు. దాంతో ఆ కుటుంబం కొంత చితికిపోయింది. ఏదో ఒకరకంగా కాలం గడుపుతున్నారు. శశి రోజూ వచ్చేది. సాయంత్రం నాలుగునించి ఎనిమిది వరకూ పిల్లలందరమూ ఆడుతూ పాడుతూ ఉండేవాళ్ళం. శశి ఒక్కొక్కప్పుడు మధ్యాహ్నం కూడా వచ్చేది. తండ్రిపోయాక కొంత దిగులుగా ఉండేది.

నాకూ చిన్నప్పుడే తండ్రిపోయారు. మా అమ్మగారు నన్ను చాలా ప్రేమగా శ్రద్ధగా చూచేవారు. తండ్రి లేనిలోటు తెలిసేదికాదు. మా నాన్నగారు తగినంత ఆస్తి సంపాదించటంవల్ల మా పరిస్థితులు బాగానే ఉండేవి. మా ఇంట్లో ఎప్పుడూ అతిధీ అభ్యాగతీ అని ఎవరో ఒకరు బంధువులు, స్నేహితులు, ఆశ్రితులూ ఉండేవారు. అందుచేత ఇల్లు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది. నేనూ తెల్లగా అందంగా ఉంటానని అందరూ అంటూ ఉండేవారు. కాని ఆ విషయం ఎప్పుడూ నా బుఱ్ఱకెక్కేది కాదు. నేను ఏమీ పట్టించుకునేదాన్ని కాదు.

అనుకోకుండా శశికి పెళ్ళి కుదిరింది. మంచి సంబంధం వచ్చింది. మామగారు మంచి ఉద్యోగంలో ఉన్నారు. పిల్లవాడు చదువుకుంటున్నాడు.

పిల్ల బాగుందని వాళ్ళు పెళ్ళికి ఒప్పుకున్నారు. ఎక్కువ కట్నాలు అవీ కోరలేదు. తేలిగ్గా శశి పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళయిన తరువాత శశిలో మార్పువచ్చింది అది మా ఇంటికి రావటం మానేసింది. నేనూ పట్టించుకో లేదు. నాకూ వయసు వచ్చింది. ఆటలధోరణి తగ్గింది. కొన్నాళ్ళకు నాకూ పెళ్ళయింది శశి అత్తవారింటికి వెళ్ళింది. నేను కొన్నాళ్ళు మా అమ్మగారి దగ్గరే ఉండిపోయాను.

ఒకరోజు నేనూ మా అమ్మగారు ఇంకా కొందరు బంధువులు కలిసి ఊరికి వెళుతున్నాము. మా బంధువుల ఇంట్లో పెళ్ళి. ఆ పెళ్ళికి వెళు తున్నాము. అనుకోకుండా స్టేషనులో శశి కనిపించింది. అదీ, దాని మామ గారు, అత్తగారు, భర్త అంతాకలసి అదే రైల్లో వెళుతున్నారు. బహుశా ఏదైనా పనిమీద ఈ ఊరువచ్చి వెళ్ళుతున్నారేమో అనుకున్నాను. శశి మునుపటిలా లేదు చాలా మారిపోయింది. ఎంతో గర్వంగా కనిపించింది. తనే దగ్గరగా వచ్చి పలకరించింది. "ఏ ఊరు వెళుతున్నారు"? అంది. "రాజమండ్రి" అన్నాను. "మేమూ అక్కడికే వెళుతున్నాము మామగారికి ఆ ఊరు బదిలీ అయింది." అంది. "అలాగా!" అన్నాను. తరువాత చాలా గర్వంగా "మేము ఫస్టుక్లాసులో వెళుతున్నాము. మీరో!" అంది. నేను అమాయకంగా "థర్డు క్లాసులో!" అన్నాను. అలా చెప్పుకోటం అవమాన కరమని ఎందుకో నాకుతట్టలేదు. ఉన్నమాట చెప్పాను. మా చిన్నతనంలో మా అమ్మగాడు ఎప్పుడూ థర్డుక్లాసులోనే ప్రయాణం చేసేవారు. డబ్బు ఉన్నా ఫస్టుక్లాసులో వెళ్ళడం అవసరమని ఆవిడకెప్పుడూ తోచలేదు. పైగా ఆవిడవెంట ఎప్పుడూ ఎవరో ఒకరు బంధుమిత్రులు ఉంటూనే ఉండేవారు, అందరూ కలసి ఫస్టుక్లాసులో వెళ్ళడం ఎలాగూ సాధ్యపడదు. మాకూ. మాతో ఉన్న బంధువులకు ఆశ్రితులకు మధ్య ఎటువంటి భేదమూ ఎప్పుడూ మా అమ్మగారు చూపించేవారు కాదు. అందరినీ సమానంగా ఆదరంగా

చూసేవారు. బహుశా ఇటువంటి వాతావరణంలో పెరగటంచేతనే నేమో, నేను ఎంత మంచిస్థితిలో ఉన్నా ఇతరులకన్నా అధికురాలిననే భావం ఎప్పుడూ నా మనసులో కలగలేదు. నాకు అందరూ సమానంగానే తోచేవారు.

శశి ఇంకా గర్వంగానే మాట్లాడుతోంది. "మామగారికి చాలా పెద్ద ఉద్యోగం. మా వెంట ఎప్పుడూ ఇద్దరు నౌకర్లు ఉంటారు" అంది. "అలాగా" అన్నాను అమాయకంగా. అసలు అవన్నీ గర్వంతో చెబుతున్న మాటలని నాకపుడు తట్టనేలేదు. మళ్ళా ఎప్పుడో అవన్నీ తిరిగి నెమరువేసుకున్నప్పుడు తప్ప.

అంతలో రైలు వచ్చింది. మేము థర్డుక్లాస్‌లో ఎక్కాము. మా ప్రక్కనే ఉన్న ఫస్టుక్లాస్‌లో వాళ్లు ఎక్కారు. రైలు కదిలింది. "రాజమండ్రి వస్తున్నావు కదా! మా ఇంటికి రా!" అని శశి నన్ను పిలవలేదు. అయినా అది ఎబ్బెట్టుగా తోచలేదు. రాజమండ్రిలో పెళ్ళి అయిపోయిన తరువాత ఈ ఊరు వచ్చాంగదా ఒకసారి శశి వాళ్ళింటికి వెళ్ళి దాన్ని చూస్తే బాగుంటుందని తోచింది. ఎంతైనా చిన్నప్పటి నుంచి స్నేహితులం గదా! అంచేత పెళ్ళి హడావుడి తగ్గాక మా అమ్మతో "ఒకసారి శశి వాళ్ళింటికి వెళ్ళి వద్దాం!" అన్నాను. ఆవిడ సరే అన్నారు. పాపం ఆవిడకూ అంతస్థులూ, అంతరాల్యాలు అంతగా తెలియవు. ఏదో సరళంగా పోవడమే ఆవిడకు అలవాటు. అంచేత ఒక గూడుబండి చేసుకున్నాము. ఆ బండివాడికి శశి మామగారి పేరు ఆయన ఉద్యోగం సంగతి అన్నీ చెప్పాము. అలా అవస్థపడి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాము. అప్పటికి సాయంత్రం ఐదయింది. శశివాళ్ళ ఇంటిముందు పెద్దకారు ఆగి ఉంది. పక్కనే మాజట్కాబండి ఆగింది. మేము కొద్దిగా జంకుతూ లోపలికి వెళ్ళాము. లోపల హాల్లో శశి ఉంది. పెద్దపట్టుచీర కట్టుకుని ఎక్కడికో వెళ్ళడానికి రెడీగా ఉంది.

మమ్మల్ని చూచి చిరునవ్వు నవ్వలేదు. "రండి, కూర్చోండి" అనలేదు. ఏదో కొత్తవాళ్ళని చూసినట్లు అలా చూస్తూ నిలుచుంది. లోపల గదిలో శశి అత్తగారు ఉంది. ఆవిడా పెద్ద జరీచీర కట్టుకుని రెడీగా ఉంది. కాసేపటికి ఆవిడ హాల్లోకి వచ్చింది. ఆవిడా మమ్మల్ని పట్టించుకోలేదు. ఎవరని అడగ లేదు. శశి మాకేసిచూస్తూ అంది. "రోజూ మేము సాయంత్రం కారులో షికారుకు వెళతాం!" అంతే! అత్తాకోడళ్ళిద్దరూ బయటికి వెళ్ళిపోయారు. హాలు ఖాళీగా ఉంది. వెర్రిమొహం వేసుకుని ఉండిపోయాను. ఆ క్షణం ఏదో మనస్సులో ముల్లుగుచ్చుకున్నట్లయింది. ఎందుకు వచ్చానా అనిపించింది. పైగా మా అమ్మను కూడా బలవంతంచేసి తీసుకువచ్చినందుకు ఏదో అవమానంగా అనిపించింది. వాళ్ళు వెళుతున్నది ఏదో అర్జంటు పనిమీద కాదుగదా! ఊరికే షికారుకేగదా! కాస్త ఆగి మాతో మాట్లాడితే నేమి అనిపించింది. నేను మధనపడుతూ ఉంటే మా అమ్మ నిర్లిప్తంగా ఉంది. "రా పోదాం!" అంది. అంతే. ఉసూరుమంటూ మళ్ళీ బండి ఎక్కి వెళ్ళిపోయాము.

ఆ తరువాత నేను మళ్ళీ ఎప్పుడూ శశిని గురించి ఆలోచించలేదు. మళ్ళా దాన్ని కలుసుకోనూలేదు. పదేళ్లు గడిగాయి. నాకు ఒక్కత్తే ఆడపిల్ల. నాభర్త చాలా మంచివాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. మా అమ్మగారు పోయారు. ఆవిడ ఆస్తిఅంతా నాకు వచ్చింది. అయితే ఎంచేతో ఒకటిమాత్రం రాలేదు. నేను చాలా మంచిస్థితిలో ఉన్నానని, ఇతరులకన్నా అధికురాల్ననీ గర్వం మాత్రం ఎంచేతోరాలేదు. నాదృష్టిలో నాకు అందరూ సమానులే! ఏమీ తేడా తెలిసేది కాదు.

ఈ పదేళ్ళలో శశి జీవితంలో చాలా మార్పులువచ్చాయి. దాని జీవితం తారుమారయింది. దానికి నలుగురు పిల్లలు. దాని మామగారు పోయారు. చిన్నవయస్సులోనే భర్త కూడా పోయాడు. ఆర్థిక పరిస్థితులు

అంతగా బాగులేవు. ఈ వార్తలన్నీ అప్పటికప్పుడు నాకు తెలుస్తూనే ఉన్నాయి. చిన్నతనంలోనే పాపం శశికి భర్తపోయినందుకు నాకు చాలా విచారం వేసింది. మనసులోనే చాలా సేపు బాధపడుతూ ఊరుకున్నాను.

అపురూపంగా మా ఊళ్ళో ఎగ్జిబిషన్ పెట్టారు. ఒకరోజు సాయంత్రం పాపను తీసుకుని ఎగ్జిబిషన్ చూడటానికి వెళ్ళాను. ఒక స్టాలులో పాపకు బొమ్మలు చూపిస్తున్నాను. దూరంగా శశి తనపిల్లలతో కనిపించింది. కుంకుమ లేని దాని ముఖం కళావిహీనంగా ఉంది. తెల్లని చీర మాసి పేదరికానికి చిహ్నంగా ఉంది. శశి ఈ ఊళ్ళోనే ఉందని నాకు తెలియదు. నాకు దగ్గరకు వెళ్ళి పలకరించాలనిపించలేదు. దూరంగానే ఉండిపోయాను. బొమ్మలు చూస్తున్నాను. శశి నన్ను చూసినట్లుంది. గబగబా పరుగెత్తుకువచ్చి "శాంతా" అంటూ నన్ను గట్టిగా కౌగిలించుకుంది. నేను దిగ్భ్రమ చెందాను. ఏదో పోగొట్టుకున్న పెన్నిధి దొరికినట్లు దాని కళ్ళు సంతోషంతో మిలమిలా మెరుస్తున్నాయి. అది ఆప్యాయంగా, సంతోషంగా నన్ను చూస్తోంది. నాకు ఆశ్చర్యం వేసింది. పరిస్థితులు మనిషిని ఎంతగా మారుస్తాయి? దానికిప్పుడు నేనుకావాలి, నా స్నేహం కావాలి, నాఆప్యాయత కావాలి! దాని దయనీయమైన పరిస్థితికి నాకు జాలివేసింది. ఎప్పుడో మనసులో గుచ్చుకున్న ముల్లు మరచిపోవటానికి ప్రయత్నించాను. దాన్ని మళ్ళా కౌగిలించుకున్నాను ప్రేమతో! ●